క్లుప్తంగా

ఝరి పాఠశాల సందర్శన


విద్యార్థినితో చదివిపిస్తున్న ఎంఈవో సుధాకర్

కెరమెరి: పాఠశాలలోని విద్యార్థులు అందరూ చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి కెజ్మెత సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఝరి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో పుస్తకం చదివించారు. ఉర్దూతో పాటు ఆంగ్లం కూడా బాగా చదవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మంగళవారం ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మెయిన్ రోడ్, సబ్‌స్టేషన్ రోడ్, ఎస్టీఆర్ కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలలో బోరు వేయించిన 'దివ్య ఫౌండేషన్'


పనులు ప్రారంభిస్తున్న భీంరావు

కెరమెరి: మండలంలోని ఝరి గ్రామం ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నీటి కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా దివ్య ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ కుమార్ బోరు వేయించారు. ఈమేరకు సోమవారం పాఠశాల ఆవరణలో ఫౌండేషన్ వైస్‌చైర్మన్ ఆత్రం భీంరావు టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఫ్యూజుమా, ఫౌండేషన్ సభ్యులు రోహిదాస్, పితానాయక్, తదితరులు ఉన్నారు.

నేడు వీవోఏల సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో మంగళవారం వీవోఏల సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు సోమవారం తెలిపారు. వీవోఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17 నుంచి చేయనున్న సమ్మెపై చర్చించనున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, సిర్పూర్(టి) నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని వీవోఏలు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి

బెజ్జూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని బౌద్ధ సమాజ్ సంఘాల ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో ఈనెల 14న ఘనంగా నిర్వహించాలని బౌద్ధ సమాజ్ తాలూకా ఉపాధ్యక్షుడు దుర్గం దేవాజి, మండల అధ్యక్షుడు కుమ్మరి పోషన్నలు ఒక ప్రకటనలో కోరారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : దసరా
కాగజ్‌నగర్
వెంకటరమణ : బలగం
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

అలంకారప్రాయం.. పల్లెప్రకృతి వనం

- కానరాని నిర్వహణ
- కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు

తిర్యాణి: ప్రజలకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిల్లోని 143 గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. కాని క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణపై శ్రద్ధ వహించకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. నిర్వహణ చేపట్టాల్సిన కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోకపోవడంతో పేరుకే ప్రకృతి వనాలుగా మారాయి.

కానరాని ఆహ్లాదం..

ప్రభుత్వం ఆయా గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలతో పాటు మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలోని అటవీ ప్రాంతంలో బృహత్ వనం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బృహత్‌వనంలో 31వేల మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకోగా నేటికి కేవలం 4వేల మొక్కలు మాత్రమే నాటారు. ఇందులో సగానికి పైగా మొక్కలు చనిపోయాయి. మరోవైపు ఈ బృహత్ వనం మండల కేంద్రానికి దాదాపు 20కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఈ వనం అలంకారప్రాయంగా మారింది.

దీనితో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల్లో సైతం మొక్కలు ఎండిపోవడంతో మండలవాసులకు ఆహ్లాదం అందని ద్రాక్షగా మారింది.


ఫెన్సింగ్ లేని చిన్న అరటిపెల్లి పల్లెప్రకృతి వనం

పశువులకు అడ్డాగా..

ఎదులపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న అరటిపెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం సరైనా ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో పశువులకు అడ్డాగా మారింది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనానికి నేటికీ గేటు అమర్చలేదు. మండలంలోని సగానికి పైగా పల్లెప్రకృతి వనాల్లో దాదాపు ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు గ్రామాలకు దూరంగా ఉండటం, అందులో మొక్కలు లేకపోవడం, వాటి నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వంటి కారణాలతో పల్లెప్రకృతి వనాలు నిరుపయోగంగా మారాయి. దీనిపై అధికారులను వివరణ కోరగా వారికి సంబంధం లేదని తెలపడం కొసమెరుపు.

నిధులు దుర్వినియోగం



పల్లెప్రకృతి వనాల పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులు నిధులు దుర్వినియోగం చేశారు. మండలంలోని ఏ ఒక్క గ్రామంలోనూ నిబంధనల మేరకు పల్లెప్రకృతి వనాలు లేవు. వీటి ఏర్పాటులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలి.

- సార రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ, గడలపెల్లి

అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్: అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సోమవారం జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి 300 మంది చొప్పున తరలివెళ్లేందుకు అన్ని మండల కేంద్రాల్లో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సౌకర్యార్థం అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేయడంతో పాటు ప్రతీ బస్సులో ఒక ప్రభుత్వ ఉద్యోగి, ఒక పోలీస్ అధికారి ఉండేలా చూడాలని తెలిపారు. ఈ నెల 13న రాత్రి ప్రతీ మండల కేంద్రానికి బస్సులు చేరుకోవాలని, 14న ఉదయమే బస్సులు బయలుదేరే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీఆర్‌డీవో సురేందర్, డీపీవో రమేశ్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సజీవన్, ఆర్డీవో లక్ష్మి, ఆర్టీసీ డీఎం శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

డీటీడీవోపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: అవినీతికి పాల్పడిన డీటీడీవోను వెంటనే సరెండర్ చేయాలని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శులు చిరంజీవి, కార్తీక్, దినకర్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు 2022- 23 విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన ప్లేట్లు, గ్లాసులకు సంబంధించిన రూ.11.59 లక్షల నిధులను గుట్టుచప్పుడు కాకుండా విత్‌డ్రా చేసుకున్నారన్నారు. విద్యార్థులకు మాత్రం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయలేదన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. అలాగే మైనార్టీ గురుకులాల్లో జరిగిన అక్రమ నియామకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎంఐఎం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కాగజ్‌నగర్‌టౌన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ఎంఐఎం ఆధ్వర్యంలో పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, ముఖ్యఅతిథులుగా తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు గులాం అహ్మద్ హుస్సేన్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. కార్యక్రమంలో బీఎస్పీ తాలూకా ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైస్‌చైర్మన్ కృష్ణారావు

ప్రశాంతంగా టీడబ్ల్యూసెట్

కెరమెరి: మండలంలోని హట్టి, రాంజీగూడ, మోడి, అనార్‌పల్లి, జోడేఘాట్, బాబేఝరి ఆశ్రమ పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన టీడబ్ల్యూసెట్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 4 నుంచి 7 తరగతులకు చెందిన విద్యార్థులు పరీక్ష రాశారు. ఒక్కో పరీక్ష కేంద్రంలో 40 మంది విద్యార్థులు ప్రవేశపరీక్ష రాసినట్లు ఎగ్జామినర్ చంద్రశేఖర్, సీఎస్ ఎర్రన్న తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నేరుగా సైన్స్ మోడల్ స్కూల్‌లో ప్రవేశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు.


పరీక్షను పరిశీలిస్తున్న అధికారులు

'ప్రజల హక్కులను కాలరాస్తే చర్యలు తీసుకోవాలి'

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సాయన్నకు జాతీయ మానవ హక్కుల మండలి సంఘం మండల సభ్యులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతీ ఒక్కరికి ప్రాథమిక హక్కులు కల్పించిందన్నారు. ప్రజల హక్కులను కాలరాసే, అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురైతే మానవ హక్కుల మండలి సభ్యులను సంప్రదించాలన్నారు. సభ్యులు దుర్గం శ్యాంరావ్, దహగావ్కర్ సంజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండలంలోని తాటినగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు మెరుగైన కంటిచూపు కలిగి ఉండాలనే లక్ష్యంతో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సర్పంచ్ రత్నం సోమయ్య, ఎంపీటీసీ సభ్యులు బొమ్మకంటి మనిష్, కార్యదర్శి తిరుపతి, సిబ్బంది స్నేహ, నాయకులు మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

బెజ్జూర్: మన ఊరు -మన బడి కార్యక్రమం కింద మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను కలిసి విన్నవించారు.

బస్సు షెల్టర్లు లేక ఇక్కట్లు

- నీడ కోసం చెట్లే ఆధారం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. నీడ కోసం ప్రయాణికులు చెట్లను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రతీరోజు కాగజ్‌నగర్ పట్టణానికి బస్సుల్లో వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. వివిధ ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే కార్మికులు, విద్యనభ్యసించే విద్యార్థులు ప్రతీరోజు ప్రయాణిస్తుండగా, బస్సు కోసం ఎదురుచూసే సమయంలో నీడ కోసం బస్టాండ్‌లోని కిరాణాషాపుల ముందు, చెట్ల నీడన వారు నిలబడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కొంత మంది కిరాణాషాపుల యజమానులు షాపుల ఎదుట నిల్చుంటే చీదరించుకుంటున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివిధ గ్రామాల నుంచి..

మండలంలోని సారసాల, రాస్పెల్లి, సీతానగర్, వల్లకొండ, నామానగర్, పంచశీలనగర్, ఆరెగూడ, ఈజ్‌గాం, తదితర గ్రామాల నుంచి ప్రతీరోజు ప్రయాణికులు బస్సుల్లో కాగజ్‌నగర్ పట్టణానికి వస్తుంటారు. అయితే ఆయా గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. రాస్పెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు పలు గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. రాస్పెల్లిలో బస్సు షెల్టర్ లేకపోవడంతో విద్యార్థులు చెట్ల నీడలో ఉంటూ బస్సు కోసం పడిగాపులు కాస్తున్నారు. రాస్పెల్లి నుంచి కాగజ్‌నగర్‌కు ప్రైవేట్ వాహనాల యజమానులు ఒక్కొక్కరికి రూ.50లు తీసుకుంటుండగా, ఆర్టీసీ బస్సులో కేవలం రూ. 20 మాత్రమే చార్జి తీసుకుంటున్నారు. దీంతో అత్యధికంగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు పాసులను జారీచేయడంతో విద్యార్థులంతా బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సు షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


చెట్టు నీడన బస్సు కోసం వేచిచూస్తున్న విద్యార్థులు

ఇబ్బంది పడుతున్నాం



చదువుకునేందుకు రాస్పెల్లిలోని పాఠశాలకు ప్రతీరోజు వెళ్తుంటా. రాస్పెల్లిలో బస్సు షెల్టర్ లేకపోవడంతో బస్సు కోసం చెట్టు నీడన ఉండాల్సిన పరిస్థితి ఉంది. వాన పడితే తడుస్తూ బస్సు కోసం వేచి చూడాల్సి వస్తోంది.

- స్రహోని, విద్యార్థిని, సారసాల

షెల్టర్ నిర్మించాలి



గ్రామంలో బస్సు షెల్టర్ నిర్మించాలి. షెల్టర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఎండా, వానలో బస్సులు, ఆటోల కోసం వేచిచూడాల్సి వస్తుంది. బస్సు షెల్టర్ల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలి.

- రాజు, ప్రయాణికుడు, రాస్పెల్లి

వృథాగా మిషన్ భగీరథ నీరు!


కొలనులా మారిన ఎంఆర్‌సీ ఆవరణ


ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ ఆవరణలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు నుంచి సోమవారం నీరు వృథాగా పోయింది. నీటిని వదిలినప్పుడల్లా గంటల తరబడి మోటార్ ఆఫ్ చేయకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. గతంలో చాలాసార్లు సంబంధిత సిబ్బందికి విషయం తెలిపినా ఎలాంటి స్పందన లేదని ఎంఆర్‌సీ సిబ్బంది పేర్కొంటున్నారు. భగీరథ అధికారులు స్పందించి నీరు వృథా పోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.

చెట్టు నీడలో ఎంతో హాయిగా..!



కెరమెరి: నానాటికీ పెరుగుతున్న భానుడి ప్రతాపానికి ప్రజలతో పాటు మూగజీవాలు సైతం తల్లడిల్లుతున్నాయి. ఉదయం మేత కోసం వెళ్తున్న పశువులు గంట సేపు కూడా మేత మేయకుండానే ఏదో ఓ చెట్టు నీడన చేరుతున్నాయి. సరిగ్గా మేత దొరక్క, సమీపంలో తాగునీరు లేక తమ యజమానులు వచ్చే వరకు ఇలా చెట్ల కింద చల్లటి గాలి పీల్చుతూ సేదతీరుతున్నాయి. మండలంలోని పెద్దసాకడ గ్రామానికి సమీపంలో ఓ పశువుల మంద సోమవారం చెట్టు కింద సేద తీరుతున్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

'బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి'

పెంచికల్‌పేట్: తెలంగాణలో రాజకీయపరంగా బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గోలెం వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఇంటింటికీ బీజేపీ వాల్ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. బీసీల అభ్యున్నతి కోసం బీసీబంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు నారాయణ, మాచర్ల శ్రీనివాస్, మధుకర్, శ్రీకాంత్, రాజేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు